
ప్రజాశక్తి
ఆదివారం 21 జులై 2024 5
శ్రీ సత్యసాయి





రవాణా, నీటిపారుదల శాఖ మంత్రి కి వినతిపత్రం అందిస్తున్న మంత్రి సవిత

మంత్రుల దృష్టికి రవాణా, ఇరిగేషన్ సమస్యలు

ప్రజాశక్తి-పెనుకొండ

నియోజకవర్గంలో రవాణా, నీటి పారుదల శాఖలకు సంబంధించిన సమస్యలను శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. పెనుకొండ ఆర్టీసీ డిపోనకు నూతన బస్సు సర్వీసులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి సవిత కోరారు. సవిత మాట్లాడుతూ కియా పరిశ్రమ రాకతో ప్రయా ణికుల రద్దీ పెరిగిందని, పెనుకొండ పట్టణం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలంటే అవసరానికి తగ్గట్టుగా రవాణా ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణం కొత్త బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. వరదల సమయంలో రొద్దం పెద్దచెరువు, కోగిర మరువలు దెబ్బతిన్నాయని వాటి మరమ్మతులకు నిధులు, నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీరు ఇవ్వాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవించారు.

నివురుగప్పిన నిప్పులా తాడిపత్రి

◆ నేతల నోట ఫ్యాక్షన్ మాటలు ◆ మొన్న జెసిపిఆర్..నిన్న కేతిరెడ్డి సవాళ్లు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి నియోజకవర్గం నివురుగప్పిన నిప్పులాగానే ఉందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2019 నుంచి ఇక్కడ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతూనే వస్తున్నాయి. ఇప్పటికీ అవి చల్లారినట్టు అనిపంచడం లేదు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మొన్న కౌన్సిల్ సమావేశం అనంతరం పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తానంటున్నాడు... ఆయన్ను జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన తాడిపత్రి పట్టణంలోకి వస్తే పంచె విప్పి కొడతామని హెచ్చరికలు చేశారు. అది జరిగిన మరుసటి రోజే శనివారం నాడు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి నమోదయిన కేసులో పెద్దారెడ్డి హైకోర్టులో బెయిల్ పొందారు. దీనికి సంబంధించి ష్యూరిటీలు సమర్పించేందుకు ఆయన పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఏదైనా జరుగుతుందేమోనన్న ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణ అనంతరం అధికారులపై చర్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు జాగ్రత్తలను పోలీసులు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి పరస్పర కవ్వింపు చర్యలు పాల్పడకుండా వెంటనే పెద్దారెడ్డిని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతపురం నగరానికి వచ్చాక ఆయన జెసి.ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తాడిపత్రి ఆయన జాగీరు కాదని అంటూనే తనను అంతమెదిస్తానని ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నాడని ఆరోపించారు. ఆరోపించడమే కాకుండా తనకు లాగానే ఆయనకు కుటుంబముందని నేరుగా ప్రకటనలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశం అమవుతోంది. ఇద్దరి నేతల నుంచి ఇటువంటి ప్రకటనలు రావడంతో ఆ ప్రాంతంలోని ప్రజలను భయబ్రాంతులకు గురిచేసే విధంగా ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే తాడిపత్రి అంటూనే ఫ్యాక్షన్‌కు పెట్టింది పేరుగా ఉంది. అయితే గడిచిన దశాబ్ధకాలంగా అటువంటి ఘటనలేవి చోటు చేసుకోలేదు. 2014లో పెద్దవడుగూరులో సింగిల్ విండో ప్రెసిడెంట్ హత్య అనంతరం రాజకీయపరమైన హత్యలు జరిగిన ఘటనలేవి చోటు చేసుకోలేదు. అయితే ఇప్పుడు ఇద్దరు నేతల నుంచి ఫ్యాక్షన్ అన్న పదాలు బయటకు వస్తుండటంతో తిరిగి ఈప్రాంతంలో అవాంఛనీయ ఘటనలకు ఎక్కడ దారితీస్తాయోనన్న గుబులు నియోజకవర్గ ప్రజల్లో నెలకొంటోంది. అయితే పోలీసు అధికారులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. కొత్తగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ బాధ్యతలను తీసుకున్నారు. ఆయన ఈ ప్రాంత సమస్యలను ఇంకా పరిశీలించాల్సి ఉంటుంది. అంతకు మునుపు ఎన్నికల సమయం నుంచి వరుసగా ఎస్పీలతోపాటు డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణను నివారించలేకపోయారని అప్పటి ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలు సెసెన్షన్‌కు గురాయ్యరు. ఇంకా నిఘా విభగాపు అధికారి బదిలీ అయ్యారు. ఇలా ఇంత మంది ఇక్కడి ఘటనలపైనే ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కొత్త అధికారులు ఇక్కడి పరిస్థితులను ఏ రకంగా నియంత్రణలోకి తీసుకొస్తారన్నది చూడాల్సి ఉంది.

తాడిపత్రిలో అలజడికి జెసి యత్నం

నన్ను అంతం చేస్తానంటూ బెదిరింపులు - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిలో అలజడి సృష్టించేలా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. తనను చంపుతానని కూడా ప్రభాకర్‌రెడ్డి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. పెద్దారెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించాలని జెసి.ప్రభాకర్‌రెడ్డి కోరిన మరుసటి రోజే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం నాడు తాడిపత్రికి వెళ్లడం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లకు సంబంధించి కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో పెద్దారెడ్డి బెయిల్ పొందారు. దీనికి సంబంధించి ష్యూరిటీ ఇచ్చేందుకు ఆయన తాడిపత్రికి వెళ్లారు. ఆయన వెళు _ండటంతో పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన తిరిగి వచ్చాక అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తనను జిల్లా నుంచి బహిష్కరించాలని ప్రభాకర్‌రెడ్డి కోరుతున్నారని... ఈ ప్రాంతం ఆయన జాగీరు కాదని యెద్దేవ చేశారు. తనను అంతం చేస్తానని జెసి.ప్రభాకర్‌రెడ్డి అంటున్నారని... కుటంబం తనకే కాదని ఆయనకు ఉందని పేర్కొన్నారు. వాహనాల కేసులు తాను పెట్టింది కాదని... అధికారులు పెట్టిందన్నారు. అందులో ఎన్‌ఫోర్సుమెంట్ కూడా ఉందన్నారు. తప్పు చేశాడో లేదా అన్నది ఆయన నిరూపించుకోవాల్సి ఉందన్నారు. జెసి తాడిపత్రిలో అలజడలు సృష్టించేందుకే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తన అనుయాయులను భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి భయపడేది లేదని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

గృహ నిర్మాణాలపై నివేదికలు ఇవ్వండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా అభివద్ధి కోసం, గృహ నిర్మాణాలు, టిట్కో గృహాలు స్థితి గతులపై సమగ్ర ప్రణాళికలు, నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11న జరిగిన జిల్లా అభివద్ధి మండలి సమావేశంలో ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు, టిడ్కో గృహ నిర్మాణాలపై సమగ్ర నివేదికను అందించాలని ఏ మేరకు నిధులు అవసరమో నివేదికలు అందించాలన్నారు. పరిశ్రమల కోసం ఎపిఐఐసికి కేటాయించిన భూములపై నివేదికలు తనకు ఇవ్వాలన్నారు. కప్పలబండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గం భూముల పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. గొల్లపల్లి రిజర్వాయర్ అభివద్ధి కోసం చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టపర్తి చిత్రావతి నదిలో డ్రెయినేజీ మురుగునీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎన్ని నిధులు అవసరమో తెలపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల రైతులకు పంటల విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ప్రజలలో వ్యాధుల పట్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. నీరు చెట్టు పనుల బిల్లులు పెండింగ్ విషయం జలజీవన్ తదితర పథకాలను కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డిఎంహెచ్ఒ మంజువాణి, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, గహ నిర్మాణ శాఖ పీడీ వెంకటరమణారెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు



సమావేశంలో పాల్గొన్న డిఇఒ మీనాక్షి

డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈవో మీనాక్షి తెలిపారు. స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డీఈవో జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో పలు విద్యా అంశాలు, విద్యాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఎంఈఓలు తమ పరిధిలో ఉన్న పాఠశాలలను తప్పకుండా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యా బోధనలో లెసన్ ప్లాన్ బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందేలా చూడాల న్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తప్పకుండా పరిశీలించాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉపాధ్యాయులు తగిన అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. మిడ్ డే మీల్స్ ఏజెన్సీ వారు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలన్నారు. నాడు-నేడు పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలా చూసి ఫేషియల్ సెల్ యాప్ అటెండెన్స్ పరిశీలించాలన్నారు. ఎంఈఓలు తమ పరిధిలో ఉన్న ప్రయివేటు పాఠశాలలను తనిఖీలు నిర్వహించి అక్రమాలపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎడి-1 నాగరాజు, ఎడి-2 రామకృష్ణ, డిప్యూటీ డీఈవో రంగస్వామి, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

పంట పెట్టుబడి సాయం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-సోమందేపల్లి

సార్వత్రిక ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయలని సిపిఎం, వ్యవసాయ, చేనేత, సిఐటియు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరక శనివారం సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన వ్యవసాయ, చేనేత, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు తహశీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పంట పెట్టుబడి సాయం రూ. 20 వేలు, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి రోజు కూలి రూ. 600 ఇవ్వాలని, బకాయి వేతనాలు చెల్లించా లని, 2023 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి తక్షణమే పంటల బీమా, నష్ట పరిహారం రైతులు, కౌలు రైతులు ఇవ్వాలని, వ్యవసాయానికి విద్యుత్ మోటార్లు బిగించేందుకు తెచ్చిన జివో 22 రద్దు చేయాలని కోరారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెస్త క్రిష్టప్ప, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు గంగరాజు, శీలా నారాయణస్వామి, కుమ్మర కిష్టప్ప, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశు లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రవి పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అంగన్వాడీ, ఆశా, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షురాలు దిల్షాద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం సిఐటియు మండల కార్యదర్శి అయూబ్‌ఖాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వెంకటేశ్, దిల్షాద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, అంగన్వాడీ మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తింపు, ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్సన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు నూతన కన్వీనింగ్ కమిటీని ఎంపిక చేశారు. కన్వీనర్‌గా జెవి.రమణ, కో కన్వీనర్‌గా ఆయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, బాబులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ముకుంద, చెన్నకేశవ, వెంకట, అంగన్వాడీ, హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నిక సిఐటియు మండల కమిటీ సభ్యులు

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు కేటాయించిన సమయానికి హాజరై తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య ఆదేశించారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడిసి, అమడ గూరు మండలాల ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్స్‌తో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3, సాయంత్రం 5 గంటలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని సూచించారు. దీనిని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లో ఈ సర్వీసులను పెంచాలని, తద్వారా వచ్చే మొత్తాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి నరసయ్య

వెల్ఫేర్ అసిస్టెంట్లు సామాజిక భద్రత పింఛన్లను ఒకటి, రెండు రోజుల్లో పంపిణీ చేసి మిగిలిన మొత్తాన్ని వెంటనే ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు నాగేశ్వర్‌రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, దౌలాసాబ్, ఈఓఆర్డీ ఇందిరాబాలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

హాకీలో మెరిసిన మధురిమబాయి

ప్రజాశక్తి-సోమందేపల్లి



జ్ఞాపికను అందుకుంటున్న మధురిమబాయి

స్థానిక వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న మాంసం వ్యాపారి రవీంద్ర నాయక్, రేణుకా బాయి దంపతుల రెండో కుమార్తె మధురిమ బాయి హాకీ క్రీడలో రాణిస్తోంది. ఆమె కేరళలో నిర్వహించిన హాకీ సబ్ జూనియర్ సౌత్ జోన్ ఛాంపియన్ షిప్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మధురిమబాయి ఆర్‌డిటి విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తూ హాకీలో ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటికే పలుమార్లు జిల్లా, రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటింది. ప్రస్తుతం కర్నాటకలో ఫస్ట్ ఇంటర్ చదువుతోందని, కేరళలో జరుగుతున్న సబ్ జూనియర్ హాకీ సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఆంధ్ర జట్టు విజయం సాధించటంతో పాటు మధురిమబాయికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జాబ్‌మేళాకు స్పందన

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. క్యూ కాంటాక్ట్, వి కేర్, ఐసిఐసిఐ బ్యాంక్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూకు 54 మంది హాజరు కాగా ఆరుగురు అభ్యర్థులు రూ. 2.5 నుంచి రూ. 3.2 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారు. వారిని కళాశాల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి అభినందించారు. నిరుద్యోగ యువతకు చేయూతనివ్వటానికి ఎల్లవేళలా ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి.ఆదిశేషారెడ్డి, ఎఒ కేశవయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబా, కంపెనీ ప్రతినిధులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కోర్టు నిర్వహణకు ప్రత్యామ్నాయ భవనాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం



భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎడిజె శైలజ, జడ్జి శ్రీధర్, తదితరులు

ప్రత్యామ్నాయ కోర్టు భవనాలను శనివారం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పరిశీలించారు. ప్రస్తుతం కోర్టు ఆవరణలో ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయ స్థానం, ప్రత్యేక న్యాయమూర్తి న్యాయస్థానం శిథిలావస్థకు చేరుకున్నాయి. పాత రెవెన్యూ కార్యాలయాన్ని న్యాయస్థానాల నిర్వహణ కోసం ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఎడిజె పాత రెవెన్యూ కార్యాలయ భవన సముదాయాన్ని సందర్శించారు. కలియ తిరిగి న్యాయమూర్తి ఛాంబ ర్, బెంచ్, తదితర వాటికి అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. ఈ భవన సముదాయం కోర్టు నిర్వహణకు అనుకూలంగానే ఉందని, ఈ విషయాన్ని జిల్లా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లను న్నట్లు ఎడిజె తెలిపారు. వారి వెంట అడ్మినిస్ట్రేటివ్ అధికారి నరసింహులు, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు సిద్దు, కళావతి, శివశంకర్ ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం

హిందూపురం : మున్సిపాలిటీ పరిధిలోని నానెప్పనగర్‌లో వెలసిన షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో నూతనంగా కమ్యూనిటీ హాల్, అన్నదాన సత్ర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటి నిర్మాణానికి శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్ రూ. లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వేణు గోపాల్, గొల్లన్న, తదిత రులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నవీన్ నిశ్చల్

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

యోగివేమన రిజర్వాయర్‌ను పరిశీలించిన పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహాయ, సహకారాలతో చిత్రావతి, జిల్లేడుబండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన శనివారం అధికారులతో కలిసి మండలంలోని యోగి వేమన రిజర్వాయర్‌ను సందర్శించారు. ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేక నీరు వృథా అవుతోందని అధికారులు వివరించారు. అనంతరం ఆయన స్థానికంగా ఉన్న రైతులు, గ్రామాల ప్రజలతో మాట్లాడారు. రిజర్వాయర్ నుంచి ఏ ఏ ప్రాంతాలకు నీరు వెళ్తోంది.. ఇంకా కొన్ని ప్రాంతాలకు ఇచ్చేందుకు ఏం చేయాలనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ యోగి వేమన రిజర్వాయర్ నుంచి ముదిగుబ్బ తాగునీటి సమస్య తీర్చే ఆలోచన చేస్తున్నట్టు వివరించారు. కేవలం వర్షాధారంగా ఉన్న ఈ ప్రాజెక్టుకు శాశ్వత నీటి కేటాయింపులు చేసే అంశంపై త్వరలోనే సిఎం చంద్రబాబును కలుస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ప్రాజెక్టు నిర్వహణ కూడా సరిగా లేదన్నారు. ఇక్కడ ముందుగా మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలన్నారు. ఆ తర్వాత వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు నీరిచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. మండలంలోని 3 ప్రాజెక్టులపై ఇక నుంచి ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. అలాగే జిల్లేడుబండ, చిత్రావతి రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. త్వరలోనే అన్ని అంశాలపై మంత్రి సత్యకుమార్‌తో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు.



రిజర్వాయర్ వద్ద అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

మానవ జీవితంలో సైన్స్ కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్, జెవివి సభ్యులు

హిందూపురం : మానవ జీవితంలో సైన్స్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుందని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(ఎస్‌ఎవి ఆర్) ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, జెవివి ప్రతినిధి డాక్టర్ ఈటి రామ్మూర్తి పేర్కొన్నారు. కళాశాలలో శనివారం 'సైన్స్ సామాజిక సమస్యలను పరిష్కరిస్తుందా' అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానవుని నిత్యజీవితంలో ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. సైన్స్ లేనిదే మానవ జీవితం లేదన్నారు. సైన్స్ ప్రతి మానవ విశ్వ కళ్యాణానికి, వినాశానికి దోహదం చేస్తుందన్నారు. మనిషి మనుగడ కూడా సైన్స్ పైనే ఆధారపడి ఉందన్నారు. వక్తృత్వ పోటీల్లో విద్యార్థినులు హేమలత, షాహిస్త అంజుమ్, నవీరాబాను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు యశోదదేవి, హేమమారుతి, పోలయ్య, శ్రీకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు రామకృష్ణ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

గాండ్లపెంట : సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని ఎంపిడిఒ కె.రామానాయక్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన వారి తో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబల కుండా మురికి కాలువలు, చెత్తకుప్పలు, నీటి ట్యాంకుల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టా లని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సోమవారంలో పల్లి సచివాలయ పరిధిలో ఈఓఆర్‌డి సునీత ఆధ్వర్యంలో నీటి ట్యాంకులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్.అమీర్ బాషా, పంచాయతీ కార్యదర్శులు శంకర్, రవికుమార్, ఆషా, ఓబుళమ్మ, భవానీ, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్నిక

అమరాపురం : మండల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం గౌరవాధ్యక్షులు ఎవిపి. హనుమంతరాయప్ప సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా ఎస్.సిద్దేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శివచారి, సహకార్యదర్శిగా ఆర్.చంద్రప్ప, కోశాధికారిగా కెంకెర సిద్దేశ్వర, కార్యవర్గసభ్యులుగా పిజె.తిప్పేస్వామి, టి.తిప్పేస్వామి, జి.విద్యాసాగర్, మల్లికార్జున గౌడ, ఎంఎస్.తిప్పేస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వపరంగా జర్నలిస్టులకు, వారి కుటుంబానికి అందే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

లేపాక్షి : మండలంలో ఖరీఫ్-2024లో ఇప్పటి వరకు 1,311 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగైందని ఎఒ శ్రీలత తెలిపారు. ఆమె శనివారం ఎఇఒ, రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట చిన్న దశలోనే కత్తెర పురుగు ఆశిస్తుందని అందుకు నివారణ చర్యలను సూచించారు.

టేక్‌హోం రేషన్ పంపిణీ

రొద్దం : మండలంలోని కోగిర అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శనివారం టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైద్యాధికారి సోమశేఖర్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ సుజాతమ్మ, సిహెచ్‌ఒ కె.విజయలక్ష్మి, ఎఎన్ఎం రమాదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శి సువర్ణ, ఎంఎల్‌హెచ్‌పి రేణుక పాల్గొన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు మంచి ఆహార అలవాట్లు నేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా పిహెచ్‌సికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు.

ఎంపీపీ రాజీనామా ఆమోదం

గాండ్లపెంట : మండల ఎంపీపీ రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈవో నిదియాదేవి ఆమోదించారని శనివారం ఎంపీడీవో కె.రామానాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ ఎంపీపీ జగన్మోహన్ రాజీనామా పత్రం అందజేయగా జడ్పీ సీఈవో ఆమోదం తెలిపారన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయానికి సమాచారం అందిందని ఆయన తెలిపారు

మొహర్రం వేడుకలు ప్రారంభం

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో శనివారం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మొదటిగా ప్రశాంతి నిలయంలోని గణేష్ విగ్రహం ముందు పీర్లను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి పట్టణం లో ఊరేగింపుగా తీసుకెళ్లి జెండా మాను చావిడి వద్దకు తీసుకెళ్లి పీర్లను నిలిపారు. అక్కడ అగ్నిగుండం ఏర్పాటు చేశారు. హిందూ, ముస్లింలతో పాటు కులమతాలకు అతీతంగా మూడు రోజుల పాటు అగ్నిగుండం వద్ద అలావ్ తొక్కి ఐక్యత చాటుకుంటారు. మూడో రోజు పీర్లను ఘనంగా ఊరేగించి జల్దికి తరలిస్తారు.

ఘనంగా సత్యసాయి గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో శనివారం సత్య సాయి గిరి ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు గణేష్ గేట్ ముందు ప్రత్యేక రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగుతూ భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగిపోయారు. గోకులం, ఎనుములపల్లి సర్కిల్, పెట్రోల్ బంక్, ఎద్దుల కొండ, కమ్మవారిపల్లి చింతతోపు మీదుగా తిరిగి రథం ప్రశాంతి నిలయానికి చేరింది. కార్యక్రమంలో స్థానికులు, విదేశీ భక్తులు, ఇతర రాష్ట్రాల భక్తులు పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణలో రథాన్ని లాగుతున్న భక్తులు

పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామాల్లో పార్టీలకు అతీతంగా కలిసి పని చేసి అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇక్కడ పరిష్కారం కాని వాటిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో చర్చించారు. సర్పంచులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య పనులతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు వెంకటగారి పల్లి లక్ష్మీదేవిఓబులేసు, ప్రవీణ్, రాచువారిపల్లి వెంకటప్ప, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

నవ సమాజ స్థాపన యువతతోనే సాధ్యం

సూరన్న భారతి కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

నవ సమాజ స్థాపన యువతతోనే సాధ్యమవుతుందని సూరన్న భారతి జూనియర్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి, వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిప అధ్యక్షతన ర్యాగింగ్ నివారణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సిద్దు, కళావతి, సంతోషికుమారి పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ కీలకమైం దని, ఈ దశలో మంచి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 ఏళ్ల లోపు వారు వాహనం నడిపితే చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనం నడిపిన సమయంలో ప్రమాదం జరిగితే తల్లిదండ్రులను బాధ్యులుగా చేస్తూ కేసు నమోదు చేస్తారని సీనియర్ న్యాయవాదులు తెలి పారు. అమ్మాయిలు ఆపద సమయంలో 100కు డయల్ చేసి సమస్య చెప్పవచ్చున్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ధనుంజయ, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సభ్యులు శారద పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి

బాలికల భద్రత సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-రొద్దం

బాలికల భద్రత సామజిక బాధ్యత అని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసిన ప్పుడే బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపవచ్చునని పెనుకొండ ఐసిడిఎస్ అధికారిణి శాంతలక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారి సోమశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని కోగిర జడ్పీ హైస్కూల్‌లో ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయ ణ అధ్యక్షతన 'బాల్య వివాహాలను అరికడదాం-ఆడబిడ్డలను కాపాడుదాం' కార్యక్రమం నిర్వహించారు. శాంతలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాల, బాలికలకు కలిగే అనర్థాలపై వివరించారు. ఆడ పిల్లకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండాకే వివాహ ప్రయత్నాలు చేయాలన్నారు. అతిక్రమిస్తే రెండేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధిస్తారన్నారు. బాల్య వివాహం గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం అందించాలని తెలిపారు. ఆర్‌డిటి పెనుకొండ ఏరియా టీం లీడర్ సుధాకర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, హెచ్ఎం నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, రేణుకబాయి, రమాదేవి, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాంతలక్ష్మి

దివ్యాంగులకు అభిజ్ఞ ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని శ్రీఖాద్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘానికి వాల్మీకి విద్యాసంస్థల అధినేతలు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి అభిజ్ఞ ఫౌండేషన్ తరపున రూ. 3 లక్షల విలువ చేసే పేపర్ ప్లేట్లు తయారీ యంత్రాన్ని అందజేశారు. దీంతో పేపర్ ప్లేట్ల తయారీని శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల తో దివ్యాంగుల సంక్షేమ సంఘానికి మరిన్ని పరికరాలు అందజేస్తామన్నారు. ప్రస్తుత భవనం శిథిలా వస్థకు చేరిందని నూతన భవన నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాటర్ ప్లాంట్, చిరు వ్యాపారాలు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు రూపకల్పన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు సూర్యనారాయణాచారి, వెంకటరమణ, రామాంజనేయులు, గోపాల్‌నాయక్, ఆంజనేయులు, గంగాధర్, హరి పసాద్, కుటాగుళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం

మడకశిర : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు శనివారం కుటుంబ సమేతంగా తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని వ్యక్తిగత కార్యదర్శి రవికుమార్ తెలిపారు.



తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే రాజు

నిడిమామిడి మఠం భూమి రిజిస్ట్రేషన్‌ను ఆపేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బత్తలపల్లిలోని నిడిమామిడి మఠం భూమికి సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే నిపిపేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రాష్ట్ర నాయకులు జింకా చలపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారి ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ వెంకటరమణ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బత్తలపల్లిలోని సర్వే నెంబర్ 401లో బెంగుళూరుకు చెందిన నిడిమామిడి మఠానికి చెందిన 19.84 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో కొందరు రైతులు పంటలు సాగు చేయడంతో ఆ భూమి గ్రామ కంఠంగా మారిపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులు కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి ఆ భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి వాటి ద్వారా అనంతపురంలో మరొకరికి రిజిస్టర్ చేయించార న్నారు. దాని ద్వారా ధర్మవరంలో ఆ రిజిస్ట్రేషన్‌ను ఓకే చేయించుకోవడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని, ఆ ప్రక్రియను నిలిపేయాలని, లేనిచో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, వెంకటస్వామి, రవికుమార్, సకలరాజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రశాంతి నిలయంలో గురుపౌర్ణమి వేడుకలు

పుట్టపర్తి అర్బన్ : ప్రశాంతి నిలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి శనివారం సత్యసాయి ట్రస్టు వర్గాలు ప్రశాంతి నిలయంలో తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం సాయి కుల్వంత్ హాలులో జరిగే వేడుకల్లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శివ ప్రసాద్ శుక్లా పాల్గొననున్నారు. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, అఖిల భారత సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షులు నిమిష్ పాండే, ప్రస్తుత సభ్యులు నాగానంద, దేశ, విదేశీ భక్తులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడు పౌర్ణమి గరుడసేవ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు పౌర్ణమి గరుడ సేవ నిర్వహి స్తున్నట్లు ఈవో వెంకటేశులు, అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్ తెలిపారు. గరుడ సేవ దాతగా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యవహరిస్తున్నారని తెలిపారు.

పట్టణంలోని పుట్టపర్తి రహదారిలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న ట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సత్యనారాయణస్వామివ్రతం, 8-30 నుంచి రాత్రి 10 గంటల వరకూ స్వామి వారి పాద దర్శనం ఉంటుందన్నారు. 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని వాణి వీధిలో వెలసిన శ్రీసాయి దేవస్థానంలో ఆదివారం జరిగే గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ మట్ట చెన్నరాయశెట్టి తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకల్లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. 20వేల మందికి అన్న ప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామ్మోహన్, గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో ఆదివారం నిర్వహించే గురు పౌర్ణమి ఏర్పాట్లను శనివారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. వారి వెంట ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్, రవికుమార్, మంజునాథ్, తదితరులు ఉన్నారు.

నల్లచెరువు : గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు నగేష్ కుమార్, కరే రవి తెలిపారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం ఉంటుందని, ఆసక్తి ఉన్న దంపతులు రూ. 216 చెల్లించి వ్రతంలో కూర్చోవచ్చని వారు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ దారుణ హత్య

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

మండలంలోని సీసీ కొత్తకోట వద్ద దారుణ హత్య జరిగింది. ఆటో డ్రైవర్‌ను బండరాయితో తలపై మోదీ హత్య చేశారు. హత్యకు అక్రమ సంబంధమా.. లేక భూతగదాలా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలంలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన చాకలి సూర్యనారాయణ(48) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. రోజు వారీగా శుక్రవారం కూడా ధర్మవరం వెళ్లాడు. శనివారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన పడ్డారు. ఇంతలోనే సీసీ కొత్తకోట వద్ద హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో భార్య కృష్ణవేణి, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ నరేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తలపై బండరాళ్లతో మోదీ హత్య చేసినట్లు గుర్తించారు. డ్వాగ్ స్క్వాడ్‌తో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు ఉన్నారు. ఇతడి స్వగ్రామం తాడిమర్రి కాగా భార్య ఊరైన వెల్దుర్తిలో నివాసం ఉంటున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.



హత్యకు గురైన సూర్యనారాయణ

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : చాకలి సూర్యనారాయణ హత్య కేసు నింతులను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ వి.రత్న వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి హత్యకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ బాబిజాన్ సైదా నేతృత్వంలో రూరల్ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లి ఎస్‌సి కాలనీ వద్ద శనివారం పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలం లోని రొద్దకంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రత్నమ్మ దంపతులు ద్విచక్ర వాహనంపై రొద్దం వెళ్తుండగా ధర్మవరం పట్టణానికి చెందిన బొలెరో కోళ్ల వాహనం పెనుకొండ వైపు నుంచి పావగడ వెళ్తుంది. ఆర్.మరవపల్లి ఎస్సీ కాలనీ వద్దకు రాగానే బొలెరో వాహన డ్రైవర్ రోడ్డుపై నిలిపి ఉన్న ఆటోను ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఆ దంపతులు తీవ్రంగా గాయపడగా గ్రామస్థుల సాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. బొలెరో వాహనం వేగంగా రావడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలపారు. రొద్దంలో కూడా ఈ వాహనం నుంచి ఒకరికి ప్రమాదం తప్పినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బొలేరో, బైక్‌ను స్టేషన్‌కు తరలించారు.

యువకుడు గుండెపోటుతో మృతి

గాండ్లపెంట : మండలంలోని వడ్డిరెడ్డిపల్లికి చెందిన సాయి గణేష్(23) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రమణ, నాగలక్ష్మి దంపతుల కుమారుడు సాయిగణేష్ ఓ ప్రయివేట్ పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం నిద్రిస్తుండగా తల్లిదండ్రులు అనుమానం వచ్చి లేపారు. అయితే అతడు ఎంతకీ లేవకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. చేతికొచ్చిన కుమారుడి మృతితో ఆ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

కదిరి టౌన్ : పట్టణంలోని హిందూపురం రోడ్డు గట్ల వద్ద శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కదిరి పట్టణంలోని అయ్యప్ప ఆలయం వీధిలో నివసించే పీరుసాబ్, ఫాతిమా దంపతుల కుమారుడు రెడ్డిబాషా స్థానిక పూలఅంగళ్లులో పని చేసేవాడు. హిందూపురం రోడ్డులో గట్ల వద్ద అనుమానాస్పద స్థితిలో పడి ఉండటంతో స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి

ఓబుళదేవరచెరువు : వీధి కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి చెందని సంఘటన శనివారం మండలంలోని దిగువపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.. బాధితుడు జెరిపిటి ఆంజనేయులు తెలిపిన వివరాలు.. ఆంజనేయులు సొంత గొర్రెలతో పాటు వేరే వ్యక్తుల గొర్రెలు కలిపి 40 దాకా మేపేవాడు. శనివారం ఉదయం గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో పది గొర్రెలు మృతి చెందాయని, దీంతో రూ. లక్ష నష్టపోయినట్లు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుత్ మోటార్లు చోరీ

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని ఆలంపూర్ వద్ద ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ మెటల్ స్టోర్‌కు సంబంధించిన 22 విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. దీంతో మేనేజర్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ పోలీసులు తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులకు ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకూ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శనివారం జిల్లా ఆర్థిక గణాంకాల అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఆర్థిక గణాంకాల అధికారి ఆధ్వర్యంలో పంటకోత పరిశీలన, వ్యవసాయ గణన, వర్షపాతం, తదితర అంశాలపైప శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. అధికారులు తప్పకుండా వారం రోజులు పాటు శిక్షణలో పాల్గొని ఆర్థిక గణాంకాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిక్షణ తరగతుల నిర్వహణకు ఎడి ప్రకాష్‌రావు, డివైస్‌ఒ శ్రీనివాసనాయక్, గోపాల్, ధర్మవరం జూనియర్ సహాయకులు, టైపిస్టులు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు-చేర్పులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అదికారుల మార్పులు చేర్పులను చేపట్టింది. ఈవారం రోజుల్లో కొత్త అధికారులు వచ్చేశారు. సత్యసాయి జిల్లాకు కలెక్టర్ తోపాటు, ఎస్పీ కొత్తగా వచ్చారు. అనంతపురం జిల్లాకు ఎస్పీ కొత్తగా వచ్చారు. వీరితోపాటు జిల్లా స్థాయి అధికారుల మార్పులు ఒక్కొక్కటిగా జరుగుతూ వస్తున్నాయి. ఇక విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు అంతకు మునుపున్న వారు రాజీనామాలు చేశారు. వారి రాజీనామాలు ఆమోదించడంతోపాటు వారి స్థానంలో ఇన్‌చార్జీలను నియమిస్తూ ఈ వారంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా పాలనలో ఒక్కొక్క మార్పులు చేపడుతూ వస్తోంది. తహశీల్దార్లను ఎన్నికల సమయంలో బయట జిల్లాలకు పంపించిన వారిని తిరిగి సొంత జిల్లాలకు వెళ్లే విధంగ ఉత్తర్వులు ఈ వారంలో వెలువడ్డాయి. వారు కూడా వస్తే మండల స్థాయిల్లోనూ అధికారుల్లో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆయా తహశీల్దార్లు తాము కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు. ముఖ్య నాయకులందరినీ కలసి తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. సిఫారసుల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

ఈ వారంలోనూ ప్రకృతి కరుణించలేదు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రమంతటా విస్తారంగా వానలు పడుతున్నా అనంతపురం జిల్లాలో మాత్రం చినుకు నేల రాలడం లేదు. మేఘాలు కమ్ముకుని రావడం బలమైన గాలలకు చినుకు నేలరాలకుండా మేఘాలు తరలి వెళ్లడం కనిపిస్తోంది. గతేడాది వర్షాల్లేక సరిగా పంటలు సాగు చేసుకోలేకపోయిన రైతులు ఈసారి జూన్‌లో పడిన వర్షం చూసి ఆ ఏడాది మంచి వర్షపాతం నమోదవుతే పంటలు బాగా పండుతాయని ఆశించారు. అందుకు అనుగుణంగా దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే అదును దాటుతున్నా జులై నెలలో సరైన వర్షాలు పడలేదు. ఇక మరో వారం జరిగితే ఇక విత్తనం వేసినా రైతుకు పెద్దగా ప్రయోజనముండదు. వర్షాధారం కింద వేరుశనగ సాగుకు అంత అనువైన సమయం కాదని భావిస్తారు. అందుకే చివరి ఆ వారం రోజులైనే పెట్టుకున్నారు. ఈ వారం కూడా రాకపోతే ఖరీఫ్‌పై ప్రకృతి దెబ్బతిసినట్టుగానే ఉంటుంది. ఇప్పటికే 31 మండలాల్లోనూ ఈ నెల వర్షాభావం నెలకొంది. ఇక ప్రభుత్వం వైపే రైతులు ఎదురు చూసే పరిస్థితులు నెలకొననున్నాయి.



ఇక ఈ వారంలో రాజకీయ వాతావరణంలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి అధికారపార్టీలో కొన్ని చోట్ల అప్పుడే తగాదలు నడుస్తుండగా మరికొన్ని చోట్ల ఇతర పార్టీల నేతలతో వైరం నడుస్తోంది. ప్రధానంగా తాడిపత్రిలో అప్పుడే ఇరుపార్టీల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని బహిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రకటన చేసిన మరుసటి రోజే పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లిరావడం చర్చనీయాంశమూ అవుతోంది. రాజకీయవంగానూ ఇక్కడ వేడిని రాజేస్తోంది. ఎన్నికలు అయిపోయినా కూడా తాడిపత్రి రాజకీయ వేడి మాత్రం తగ్గడం లేదు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్న ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బస్సులను సీజ్ చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని నాగులూరు గ్రామంలో ఉన్న పీసీఎంఆర్ పాఠశాల బస్సు గత శుక్రవారం సాయంత్రం బ్రేక్ డౌన్ అయిందని తెలిపారు. అలాగే పట్టణంలోని ప్రయివేట్ విద్యాసంస్థలు ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు తనిఖీ చేసి, ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొండి నందకిషోర్, రవి, నాని, సునీల్, తదితరులు పాల్గొన్నారు.